# జీవకారుణ్యం ప్రాణభయం

కుక్కకరిచి పిచ్చెక్కిన మనిషిని చూసి అతని హృదయవిదారకమైన అరుపులు విని, వెంటనే రాని డాక్టరును తిడుతున్న అతని హితోభిలాషుల తిట్లు విని ... ఇది వ్రాశాను)

పెళ్లి పందిట్లో దమ్ అరె దమ్ ... హరెకృష్ణ హరెరామ్ అన్న రికార్డును పదే పదే దంచుతున్నారు. హోల్డాలుమీద పడుకున్న శాస్త్రి అటునుంచి ఇటు తిరిగాడు. ఆ ప్రయాణంతో అలసిపోయిన అతను నిద్రనెంత వాంఛిస్తున్నాడో, అంతగా అది దూరంగా పారిపోతోంది. కొత్త చోటవటంతో అసలే నిద్రపట్టక చస్తుంటే మధ్యలో పెళ్లివారి గోలొకటి అని విసుక్కున్నాడు శాస్త్రి. అతనికి తల నొప్పిగా ఉంది, లౌడుస్పీకర్లు మానవులకి దేవుడిచ్చిన శాపం. పెళ్లివారు తమ ఆనందోత్సాహాలను, పరీక్షకు చదువుకుంటున్న విద్యార్థులను, జ్వరపీడితులను కూడా విడవకుండా సోషలిజమ్ అవలంబించి, సమానంగా పంచిపెట్టేస్తున్నారు. ప్రపంచంలో ఇంత అనందం ఉండగా బాధ పడాల్సిన అవసరం ఎవరికీలేదని బహుశా పెళ్లివారి అభిప్రాయం కాబోలు అనుకున్నాడు శాస్త్రి. ఈ పెళ్లి జరగకపోతే ప్రపంచ జనాభాకి వచ్చిన నష్టం ఏమిటో అని విసుక్కున్నాడు. ఉన్నట్టుండి రికార్డుల హోరు ఆగిపోయింది. ఆవరించిన ప్రశాంతతలో శాస్త్రి కోపం ఎగిరి పోయింది. మైకుల కారణంగా, ఆశీర్వదించాల్సిన సమయంలో పెళ్లికూతుర్ని పెళ్లికొడుకుని తిట్టుకున్నానే అని బాధపడ్డాడు. అమ్మయ్య అని శాస్త్రి నిట్టూర్చాడు. వియత్నాంలో బాంబింగ్ ఆగినంత ప్రశాంతంగా ఉందని నిద్ర కుపక్రమించాడు. కళ్లరెప్పలు బరువుగా వాలిపోతుంటే భౌభౌ అని 'కుయి కుయి' అని కుక్కల హడావిడి మొదలైంది పెళ్లివారు ఎంగిలి విస్తరాకులు వీధిలో పారెయ్యటంతో.

శాస్త్రి నిద్ర కుక్కల హడావిడితో పూర్తిగా ఎగిరిపోయింది. అవి ఎవరికి చెందని కుక్కలు, ఎవరూ పెంచుకోని కుక్కలు, తిండికి మొహం వాచి, ఎంగిలి ఆకులకోసం

ఎగబడుతూ, చేసే హడావిడి వింటుంటే ఆ దరిద్రజాతిని, నిస్సంతు చెయ్యాలని,నిర్వీర్యం చెయ్యాలని ఉద్రేకం కలిగింది శాస్త్రికి. వాటిమీద కసిలాంటి జాలి కలిగింది. వాటి నికృష్టపు బతుకు తరతరాలుగా సాగిపోకుండా చెయ్యాలని అనుకున్నాడు. తను ఆ ఊళ్ళో అమలు జరపాల్సిన కార్యక్రమం గుర్తుకురాగానే నిద్రపట్టక పోడం గురించి శాస్త్రి మరిచిపోయాడు. దాంతో నిద్రపోయాడు.

ఆస్పత్రి కుర్రాడు అప్పలస్వామి వచ్చి లేపేవరకు నిద్రపోయాడు. ఆస్పత్రి బావి దగ్గరే మొహం కడుక్కుని స్నానం చేశాడు. ఆపైన అప్పలస్వామి చేత కాఫీ టిఫిను తెప్పించుకు తిన్నాడు. ఊళ్ళో పెద్దల్ని కల్సుకుంటే, సంసారం పెట్టుకునేందుకిల్లు చూపిస్తారు అన్న ఆశతో శాస్త్రి బయల్దేరాడు. శాస్త్రికి అతని భార్య గుర్తుకు వచ్చింది. లక్ష్మిని ఎక్కువరోజులు విడిగా ఉంచటానికి వీలులేదు, తను లేకపోతే అనవసరమైన ఆలోచనతో మనస్సు పాడుచేసుకుంటుంది.

వీధిలో, కొత్త పరిసరాలని పరిశీలిస్తూ నడుస్తున్న శాస్త్రిని 'కొత్త గొచ్చిన పసూలడాట్రు తొవరేగదా!' అంటూ గిరిజాల జుట్టు, జబ్బలకి తాయెత్తు, కండలు తిరిగిన శరీరం కలవాడు, సినిమాలో రౌడీలను గుర్తుకు తెచ్చేవాడు పలకరించాడు. బలంగా ఆరోగ్యంగా కనిపించిన దేహంచూస్తే తనకి రౌడీలు గుర్తుకు వచ్చినందుకు శాస్త్రి నవ్వుకున్నాడు. ఇదే తను, బలంగా ఉన్న పశువులనైతే ఎంత మెచ్చుకుంటాడు, ఆరోగ్యమైన మానవ దేహాలమీద మన కెందుకంత అగౌరవం? పాతికేళ్ళవాడు 'ఉసురో' మని లేడనా!

'తొఁవరేగదా!' అని రెట్టించాడా మనిషి.

'అవును' అని జవాబు చెప్పి అతన్ని మరోసారి పరిశీలించి చూశాడు. అతను మట్టి మూకుడులోని అన్నం అతనద్దగ్గర తోకాడిస్తూ నిలబడ్డ కుక్కకి పెడుతున్నాడు. భూ ప్రపంచంమీద ఉన్న రోగాలన్నీ దానికే ఉన్నట్లున్నాయి. శాస్త్రి ఆ మనిషికేసి నువ్వెవరన్నట్టు చూశాడు.

'నాను సత్తిరాజుని. ఒడ్రంగం పని సేస్తూ ఉంటాను. నాకున్నదల్లా ఈ నోర్లేని జీవాలేబాబు. అందుకనీసి, నాకు పసూలడాట్రుబాబులకీ మంచిసేవం. మరైతే డాట్రుబాబూ! మా రాఁవుడికి మంచిసూది మందేపిస్తారా?' అంటూ సత్తిరాజు ఆ కుక్కని పరిచయం చేశాడు. నీ అవసరం నాకుంది సుమా అని చెప్పాడు. శాస్త్రి అల్లాగే అనలేదు. కాని అతని నవ్వులో భరోసా కనిపించింది సత్తిరాజుకి.

'యాడైనా ఇల్లు దొరికిందా బాబూ!' అని ప్రశ్నించాడు సత్తిరాజు,

'లేదు. వెతుక్కోవాలి అందుకే బయల్దేరాను' అని జవాబిచ్చాడు శాస్త్రి.

'మొన్న సోంయాజులు బాబింటో నానొడ్రంగం పనిసేశాను. ఓ బాగం అద్దెకిచ్చీయడం కోసం ఆ బాబూ పని సేయించాడు. ఎళ్ళి వాకబు సేత్తారా బాబు! ఏటో నా యెర్రి! మీకు సోంయాజులు బాబెవరో ఏటో ఏ మెరుక! నడండి బాబు! నాను సూపిత్తాను,' అంటూ లోపలికి వెళ్ళి చొక్కా తగిలించుకు వచ్చాడు. చొక్కా వేసుకున్న సత్తిరాజు రౌడీలా కాక పెద్ద మనిషిలా కనిపించాడు శాస్త్రికి. తోకాడించుకుంటూ వెంటపడిన రాఁవుడిని గసిరాడు సత్తిరాజు.

దార్లో 'మీ ఆస్పత్రిలో పన్సేసే అప్పల్సోఁవి చెప్పాడు సాస్తులు బాబొచ్చాడని. అప్పుడే నాకీ ఆలోచనొచ్చీసింది. సోంయాజులు బాబు బామ్మర్లకిగానీ ఇల్లీడు. తాసిల్దోరుసేసి పించెనీ పుచ్చుకున్నోడేమో ఇల్లు మా దర్జాగా కట్టీసినాడు, ఆ తరా ఇల్లు మరోటి ఈ ఊరు మొత్తంలో నేదు అంటూ సత్తిరాజు చాలా వివరాలిచ్చాడు.

సోమయాజులిల్లు చూపించాడు. వంటగది కాకుండా రెండుగదులు. బావి దగ్గర తంటాల్పడాల్సిన అవసరం లేకుండా చిన్న స్నానాలకొట్టు. ఊరి పందుల మీద మునిస్పాలిటి మీద ఆధారపడకుండా సెప్టిక్ టాంకు ఉన్నాయి, అద్దె నలభై రూపాయలు చెప్పాడు సోమయాజులు. శాస్త్రికి అద్దె కూడా నచ్చింది. 'ముప్పైకిచ్చీమను బాబూ!' అంటూ సత్తిరాజు చెవులు కొరికిన దాని ఫలితంగా ముప్పైఅయిదురూపాయలకు బేరం కుదిరింది. అల్లాంటి మంచి ఇల్లు దొరకటం కేవలం తన అదృష్టంగా భావించాడు శాస్త్రి. 'నువ్వు నాకు చాలా సహాయం చేశావోయి సత్తిరాజు' అన్నాడు శాస్త్రి స్నేహపూర్వకంగా. సత్తిరాజు వినయంగా నవ్వాడు.

ఇల్లు దొరికిన వారం రోజులకి శాస్త్రి భార్య లక్ష్మి ఆ ఊరు జేరింది. లక్ష్మిని చూసి 'ఏటో ఆ అమ్మగారు సొనా దిగూలుగ ఉంటారు' అనుకున్నాడు సత్తిరాజు. సత్తిరాజుని పరిచయం చేస్తూ అతనివల్లే తమకింత మంచి ఇల్లు దొరికిందని చెప్పాడు శాస్త్రి. లక్ష్మి సత్తిరాజు కేసి ఆపేక్షగా చూసింది. సత్తిరాజు పొంగిపోయాడు, 'ఇల్లుచూసి పెట్టినట్టే మాకు పనిమనిషిని కూడా సూసి పెట్టు సత్తిరాజూ!' అంది లక్ష్మి, ఆమాట వింటూనే సత్తిరాజు పరుగుచ్చుకున్నాడు. పావుగంటయ్యేసరికి ఓ పద్దెనిమిదేళ్ళ పడుచును తీసుకుని వచ్చాడు. ఆపిల్ల నడుస్తుంటే లేడిపిల్ల ఛెంగు ఛెంగున గెంతుతున్నట్టు అనిపించింది లక్ష్మికి.

'పనిచేస్తావా? చెయ్యగలవా' అని అడిగింది లక్ష్మి.

'మా సిఁవాచలంకి పనేటి రాదు. వాళ్ళ అయ్య, అంటే మా మాఁవ దీన్ని గాడిద నాగ పెంచీసి నాడమ్మా! మీ ఇంటి కాడుంచుకుని పనిపాట నేరిపి ఆడదాని నాగా సెయ్యమ్మా' అంటూ జవాబిస్తున్న సత్తిరాజు నడ్డుకొట్టి.

'పోరా సత్తిగా!' నీ కొడ్రంగం ఒచ్చిన పాటి నాకింటి పన్లొచ్చునేరా! మొన్న నువ్వేటి సేసినావ్! సోంయాజులు బాబు 'ఈదివైపుకి తలుపు సెయ్యరా' అంటే. ఈడు తలుపు సెయ్యబోయి కిటికీ సేసీనాడు. ఈడిని మాత్తరం ఒడ్రంగం పనికి పిలమోకండి' అంది సిఁవాచలం.

'నన్ను పనికోరు పిలవకపోతే నీ నోట్లో గడ్డే. నీకు గంజినీళ్లోళ్లోస్తారే!'

'నువ్వెందు కొయ్యాల. మా అయ్య నేడా, రేపు నన్ను మనువాడినోడొయ్యడా ?.

'నిన్నోడే మనువోడేది నానంటే ఏదోమా(వ మీద ప్రేమకొద్దీ సరేనన్నాను. అందరికీ మీ అయ్యమీద నానాగ కనికరం ఉంటాదేటి?' అన్నాడు సత్తిరాజు నవ్వుతూ.

'ఓరి కోతిముకవా! నువ్వు మనువాడటానికి ముందు కొచ్చీసినావు గదా అని ఏ బుద్ధి లేనిది ముందు కొత్తుందిరా నిన్ను మనువాడటానికి' ఆంది సిం(వాచలం ఉడుక్కుని.

శాస్త్రికి - లక్ష్మికి వాళ్లని చూస్తూంటే ముచ్చటేసింది. ఆ కొంటెమాటల వెనుక వాళ్ళకున్న అనురాగం తెలుస్తూనే ఉంది. సత్తిరాజు పిలవటం పిలవగానే సిం(వాచలం రావటం అభిమానాలు లేకపోతే జరిగేవి కాదుకదా ! సిం(వాచలం పన్లోజేరిన రోజునే, ఆ పిల్లకి పనిపాటలు బాగా వచ్చని లక్ష్మి గుర్తించింది. సిం(వాచలం వేరే ఎక్కడా పని కుదురుకోకపోడంతో పనైపోయినా 'అమ్మ గోరూ' అంటూ లక్ష్మి వెనకాతలే తిరుగుతూ చేతిలో పనందుకునేది. శాస్త్రి ఆస్పత్రికి వెళ్తే దిగులుగా ఒంటరిగా ఉండాల్సిన బాధ లక్ష్మికి తప్పింది. ఆఖరికి మాట్లాడుకున్నపనికి, సిం(వాచలం చేస్తున్న పనికి పోలిక లేకుండా పోయింది. అల్లాగే లక్ష్మి పెట్టుపోతలు పెంచింది. పండగలు వస్తే సత్తిరాజు సిం(వాచలం ఓపూట లక్ష్మి పెట్టిన భోజనం చెయ్యాల్సిందే! సత్తిరాజు ఒకోపూట తన సంరక్షణలో ఉన్న ఊరకుక్కల నిమిత్తం లక్ష్మినడిగి అన్నం పట్టుకువెళ్ళటం మొదలు పెట్టాడు.

రాం(వుడు రోజురోజుకి రోగాలు ముదిరి బాధగా మూల్గటం మొదలుపెట్టింది. దాన్ని చూస్తుంటే సత్తిరాజుకి యేడుపు పర్యంతం అవుతోంది. అతనంత బాధపడుతుంటే అతని స్నేహితులు 'ఓరి సత్తిరాజు! పసూలడాట్రు మీవోడే కదా! పోయి సూడి' అంటూ సలహా ఇచ్చారు.

'ఏటివై ఆబాబు సూడ్డనుకున్నారా?' అని గం(య్యిమని, ఆపైన ఇన్నాళ్ళు తనకా ఆలోచన రానందుకు తన్నుతాను తిట్టుకుని రాం(వుడిని తీసుకుని పశువుల ఆస్పత్రికి వెళ్ళాడు.

'ఏమోయి సత్తిరాజు, ఇలా వచ్చావ్?' అంటూ పలకరించాడు శాస్త్రి.

'మా రావుడికో మంచి సూదిమందిచ్చేసెయ్యి బాబు! దాని బాధ సూత్తుంటే అది సచ్చినా మామంచి మేలెై అనిపిత్తావుంది' అన్నాడు సత్తిరాజు బాధగ.

రాం(వుడిని చూస్తుంటేనే దానికే మందేసినా, మహా అయితే మరో నెలకిమించి బతక దనిపించింది శాస్త్రికి. మరోనెల అది బతికితే ఆ జీవుడు బాధపడటమేగాని, చివరికి పిసరంత ఉద్ధరింపు లేదు. అది తినే తిండి మరోజీవి తినడానికి పనికివస్తుంది. దాన్ని చంపేస్తేనో! తొంభైయేళ్ళు నిండి ఎప్పుడూ మంచం మీద మూల్గుతూ పడుక్కునే తాతయ్యలను చేతైనంత కాలం బతికించుకోవాలని తాపత్రయ పడే మానవ జాతికి, మరోజాతి పట్ల నిర్ణయాలు తీసుకునే హక్కెవరిచ్చారు? నిజంగా రాం(వుడిని కనుక 'వెంటనే ఛస్తావా? మరి కొంతకాలం బతుకుతావా?' అని అడిగితే ఏమంటుంది? ఇట్లా ఆలోచిస్తున్న శాస్త్రి ఆలోచనలు రాం(వుడు మూల్గటంతో తెగిపోయాయి. సత్తిరాజు మాటలు మనస్సులో తిరిగాయి. శాస్త్రి నిర్ణయం తీసుకుని రాం(వుడికిమందిచ్చాడు. రాం(వుడు ఆ మర్నాడు తన రోగ భూయిష్ఠమైన శరీరాన్ని

త్యజించింది. సత్తిరాజుకి అది బొత్తిగా ఆ మర్నాడే చచ్చిపోయే స్థితిలో లేదని తెలుసును. దాని చావుకి, తనుదాన్ని ఆస్పత్రికి తీసుకుపోవడానికి ఏమన్నా సంబంధం ఉందా అని ఆలోచించాడు. 'పిల్లా పిచుకా లేనోడట్టాంటి ఎదవపని సేత్తాడా' అని సమాధాన పెట్టుకున్నాడు. లక్ష్మికీ విషయం అంటే రాఁవుడి చావు విషయం తెల్సి కంటతడి పెట్టుకుంది. సత్తిరాజుకి అనుమాన నివృత్తి అయింది. 'ఆయమ్మ మొగుడట్లాంటి పన్సెయ్యడు' అనుకున్నాడు.

లక్ష్మిని చూస్తుంటే శాస్త్రికి చాలా జాలిగా ఉంటుంది. ఎత్తునుండి ప్రవహించే నదికి అడ్డు పడగా గమనం ఆగిపోయి నీళ్ళు విస్తరించి, ఎప్పుడు అవకాశం వస్తుందా ఎప్పుడు కిందకి ఉరికి పచ్చని పొలాలను తనివిదీరా తడుపుదామా అని ఉన్న నదిలా ఉత్సాహమే గాని అవకాశం లేని దానిలా ఉంటుందనుకుంటాడు. 'ఆయమ్మని సూత్తుంటే మాసెడ్డ బాదగా ఉంటుంది' అనుకుంటాడు సత్తిరాజు. 'ఆయమ్మ కడుపునో కాయకాసీస్తే ఏ బెంగానేదు అనుకుంటుంది సిఁవాచలం. శాస్త్రి 'ఆపరేషన్ చేయించుకో లక్ష్మి' అంటాడు. లక్ష్మి జవాబు చెప్పదు మూగగా బాధ పడుతుంది.

శాస్త్రికా జిల్లాలో పని. తక్కువగా ఉంది. అసలా జిల్లాలో పశువులే తక్కువ. సత్తిరాజు రాఁవుడిని ఆస్పత్రికి తీసుకురావటంతో శాస్త్రికి ఆ ఊరు రాగానే తను చెయ్యాలనుకున్నపని గుర్తుకు వచ్చింది. అప్పల స్వామిని పిల్చి, వీధి కుక్కలకి బిస్కెట్లుపెట్టి మచ్చికచేసుకుని ఆస్పత్రికి తెమ్మని పురమాయించాడు. అప్పలస్వామి అల్లా తెచ్చిన కుక్కలకి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్‌లు చెయ్యటం మొదలుపెట్టాడు శాస్త్రి. అప్పలస్వామికి మొదట్లో శాస్త్రి చేస్తున్న పనేమిటో తెలియదు. తెలిశాక అందరిలోను ఆ విషయం చెప్పటం మొదలుపెట్టాడు. అప్పలస్వామికి వయస్సు పదహారేళ్ళు.

ఆ విషయం నెమ్మదిగా సత్తిరాజుకి తెల్సింది. రాఁవుడి విషయంలో అనుమానం తలెత్తింది, శాస్త్రి కత్తికి బలవకుండా కుక్కల్ని దాచటం మొదలుపెట్టాడు. ఒక రోజు అప్పల స్వామికి, సత్తిరాజుకి పేచీ వచ్చింది. అప్పలస్వామి పిలుస్తున్న కుక్కనే సత్తిరాజు పిల్చాడు. నేను దాన్ని పిలుస్తున్నా గదా ! నువ్వుదాన్ని పిలుస్తావేటి కద?' అని అడిగాడు అప్పలస్వామి.

'పోవై అప్పల్సామి! మీ డాఁట్రు అసుమంటి ఎదవన్నెదవ పన్లు సేస్తున్నాడు కాబట్టే ఆళ్ళకి పిల్లాపిసుక నేరు, ఆయమ్మన్నాడు? ఆ యమ్మేఁటి పాపం సేసింది. ఏటి నేదు ! ఆ బాబు పాపం ఆ బాబుని కట్టుకున్నందుగ్గాను ఆయమ్మన్కొడ్తోంది! ఆబాబు డబ్బున్నోడు. పాపపున్నాల బీతి లేనోడు. నీకేటి పొయ్యేకాలం నువ్విట్టాంటెదవ పన్లు సేస్తే నీ వొంశెం నాశినం అయిపోదా!'

అయినా ఆ నోరూ వోయీలేని జీవాలు పిల్లల్నెట్టరాదని సెప్పడానికి నువ్వోడు? ఆ బాబోడు! నానీ కుక్కనిడిసి పెట్టేదినేదు. సెప్పుకో పోయి ఆ డాఁట్రుబాబుతో' అని సత్తిరాజు దులిపి పారేశాడు.

అప్పల్సామి, సత్తిరాజు విషయం శాస్త్రితో చెప్పాడు. శాస్త్రి బాధపడ్డాడు. తిండిలేని

ఈ దేశంలో చంపడం తప్పైతే అవుగాక, పుట్టుకని అరికట్టడం ఎంత పాపం అయిపోయింది! పుట్టిన జీవి తిండిలేక మలమల మాడిపోతుంటే పిడికెడు మెతుకులు రాల్చకపోతే ఏ పాపం రాదు! ఎందుకంటే అల్లా మాడటం అది చేసుకున్న కర్మ, కాని ఆ జీవి పుట్టి ఆ కర్మ ఫలితాన్ని పొందకుండా చెయ్యటం పాపం.

అప్పలస్వామి పదహారేళ్ళవాడు. సత్తిరాజన్న మాటలు ఊళ్ళో అందరికీ తెల్సిపోయాయి లక్ష్మితో సహా! ఊరు వారంతా శాస్త్రి చాలా పాపాత్ముడని నిర్ణయించారు. అందుకే దేవుడతనికా శిక్ష వేశాడు అని బయటికనేశారు. ఇవన్నీ విని లక్ష్మి బెదిరి పోతుందని సింహాచలం అనుకుంది. లక్ష్మి చెక్కు చెదరలేదు. ఆమెకు వెళ్ళిన ప్రతి ఊళ్ళో ఈ శాసనార్థాలు అలవాటైపోయాయి. చేస్తున్న పాపాలు చేస్తూ ఉంటే ఇంజక్షన్లు, ఆపరేషన్లు ఎవర్నుద్ధరిస్తాయనే లక్ష్మి, శాస్త్రి సూచనని ఆమోదించదు. 'అయినా ఈ దేశానికి పసిపిల్లలు బరువు. అకాడికి నేనాపరేషన్ చేయించుకోడం ఎందుకు? పిల్లల్ని కనటం ఎందుకు?' అంటూ ప్రశ్నిస్తుంది. ఆ మాటలు లక్ష్మి హృదయపూర్వకంగా అనదు. నిస్పృహతో అంటుంది. ఆమె బాధ శాస్త్రికి తెల్సు, శాస్త్రికి శాస్త్రంలోను మానవయత్నంలోను ఉన్న నమ్మకం దేవుడిలో లేదు. దైవ నిర్ణయం ప్రకారం అన్నీ జరుగుతాయనే లక్ష్మి నమ్మకం, తర తరాలుగా కర్మ సిద్ధాంతాన్ని, తప్పుగా అర్థం చేసుకున్న జాతిలో పుట్టి పెరగటం వల్ల కలిగింది.

దేవుడు లక్ష్మికి పరీక్ష పెట్టాడు. ఓ రోజున ఇల్లుగలావిడ సంతోషంగా వచ్చి 'మా మనవరాలికి అయిదో నెలట' అంది లక్ష్మితో.

'అల్లాగా' అంది లక్ష్మి నిర్లిప్తంగా.

'పెళ్లయి అయిదేళ్ళయినా పిల్లలు పుట్టకపోతే దాని మొగుడు దానికి ఆపరేషన్ చేయించాడు' అందావిడ. లక్ష్మి నిర్లిప్తంగా ఉండలేకపోయింది. ఆమెను అన్ని వివరాలు అడిగింది. ఇల్లుగలావిడ తాసిల్దారు పెళ్ళాం. లౌక్యురాలు. 'నువ్వు చేయించుకో' అని చెప్పకుండా తనూ ఆపరేషన్ చేయించుకుంటే బావుండునన్న అభిప్రాయం లక్ష్మికి కలిగేలా చేసింది.

లక్ష్మి ఆలోచించింది. పూర్వంలో జరగని ఎన్నో విషయాలిప్పుడు జరుగుతున్నాయి. మనుషులిప్పుడు బొందితో చంద్రలోకం వెళ్తున్నారు. అల్లాంటప్పుడు తను శస్త్ర చికిత్సచేయించుకుంటే వచ్చిన నష్టమేమిటి? శాస్త్రికి తను శస్త్ర చికిత్స చేయించుకోడం అభిమతమైతే తను మొండికెయ్యటం పాతివ్రత్యం అవుతుందా? తను భర్తను ఎదిరించటంవల్లనే దేవుడికి కోపం వచ్చి తనకి పిల్లల్నివ్వలేదేమో! ఇల్లా ఆలోచిస్తున్న లక్ష్మిని, ఇంటివారి మనవరాలి విషయం విన్న శాస్త్రి ఆపరేషన్ విషయంలో మళ్ళీ కదిపాడు. లక్ష్మి సరేనంది. ఆలస్యం అమృతం విషం అని శాస్త్రి లక్ష్మిని విశాఖపట్నం తీసుకువెళ్ళి ఆపరేషన్ చేయించాడు.

కాలం నెమ్మదిగా నడుస్తోంది. ఊళ్ళో సత్తిరాజు, జీవకారుణ్యంకల మరికొందరు శాస్త్రిని వెలివేశారు. శాస్త్రికి సత్తిరాజంటే కోపం లేదు. అతను మంచివాడు. తనకున్నది అంతో ఇంతో ఆ నోర్లేని జీవాలకి పెట్టేవాడు. చదువుకోనివాడు. పుణ్యాపాపాల విషయం లోతుగా ఆలోచించలేనివాడు. అందుకని శాస్త్రి సత్తిరాజుని తప్పుపట్ట లేదు. కాని ఊళ్ళో కుక్కలకి

ఎంగిలి చెయ్యి అయినా విదల్చనివారు, పాపం చెయ్యకపోవడంవల్లనే తాము పుణ్యాత్ముల పట్టికలో జేరిపోయామని నమ్మేవారు, శాస్త్రిని కసాయివాడిగా జమకట్టి మాట్లాడటం శాస్త్రికి కోపం తెప్పించింది. రేపు వీళ్ల పశువులకి జబ్బుచేస్తే కుంచం తిప్పి కొలుస్తారు. ఆ విషయం శాస్త్రికి తెల్సు.

ఆ రోజు పొద్దున్న శాస్త్రి సంతోషంగా నిద్రలేచాడు. ఆ క్రితం రోజు రాత్రి, లక్ష్మి తను నీళ్ళు పోసుకున్న సంగతి చాలా సంబరంగా శాస్త్రితో చెప్పింది. ఆ సంతోషంలో మర్నాడు పొద్దున్న బయల్దేరి సింహాచలం వెళ్దాం అన్నాడు శాస్త్రి. శాస్త్రికి దేవుడిపట్ల అంత లక్ష్యం ఉండటం లక్ష్మికి ఆనందం కలిగించింది. బండి చేయించుకుని బస్సు స్టాండుకు వెళ్తున్న శాస్త్రికి, లక్ష్మికి సత్తిరాజింటి దగ్గర ఏదో గొడవగా ఉండటం కనిపించి బండి ఆపించారు. శాస్త్రి బండి దిగాడు.

'మావోడిని కుక్క కరిసింది బాబు' అంది సిం‌వాచలం.

'ఎప్పుడు కరిచిందోయి సత్తిరాజు?' అని శాస్త్రి అడిగాడు.

'ఓ గంటైనాది' అని సత్తిరాజు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు.

'ఆ కుక్కేది?'

'దానికి కూడా సూదిమందే సేస్తావా బాబు. దానికీ రాంవుడికి పట్టినగతే పట్టించేసీ!' అన్నాడు నిష్ఠూరంగా సత్తిరాజు.

శాస్త్రి అప్రతిభుడైపోయాడు. తను చేసినపని సత్తిరాజు ఊహించగలుగుతాడని అంతవరకు శాస్త్రి అనుకోలేదు.

'అద్సరే సత్తిరాజూ! నిన్ను కరిచిన కుక్క పిచ్చిదవునో కాదో తెల్సుకోవాలి. అది పిచ్చిదైతే ఇంకా ఎవరినైనా మనుష్యుల్నిగాని కుక్కల్నిగాని కరిచే అవకాశం ఉంది. కనుక దాన్ని ఓకంట కనిపెట్టాలి' అన్నాడు శాస్త్రి బతిమాలుతూ.

'అదింకోర్ని కరిసేకుండా సంపేద్దురు గాని.'

'పోన్లే దాన్ని నేనేం సెయ్యనుగాని దాన్ని తెచ్చి గట్టిగా తాడుతో కట్టెయ్యి. అది పిచ్చిదైతె వారంరోజుల్లో చచ్చిపోతుంది. అప్పుడు నువ్వు ఇంజక్షను తీసుకోవాలి. అది చచ్చిపోదూ! మరీ మంచిది. అది పిచ్చిది కాదన్నమాట. నువ్వు పుండుకి మందేసుకుంటే చాలు. అందుకని అది ఇంకే మనుష్యుల్ని కాని కుక్కల్నిగాని కరవకముందే జాగ్రత్తపడు' అని శాస్త్రి సలహా ఇచ్చి బండెక్కాడు.

ఊళ్ళో సంచలనం చెలరేగింది. ఆ కుక్కని వెతకడం మొదలుపెట్టారు. అది కనిపించలేదు. మర్నాటికి భయం పెరిగిపోయింది. ఊళ్ళో పిల్లలు వీధిలో ఆడుకుంటున్నప్పుడు ఏమూలనుంచి వచ్చి కరుస్తుందో అని భయం పట్టుకుంది, పెద్ద వాళ్ళు దుడ్డుకర్రలు పుచ్చుకుని తిరగటం మొదలుపెట్టారు, మధ్యాహ్నం అయ్యేసరికి మానసిక ఆందోళన పెరిగిపోయి. 'వెధవ కుక్కలు కనిపించినదాన్నల్లా చంపిపారేస్తే సరి. ఈ ముదనష్టపు కుక్క ఇంకెన్నిటిని

కరిచిందో! దీన్ని కరిచిన కుక్క ఏదో!' అన్నారు ఎవరో మరీ భయస్థులు. అంతే సాయంత్రం అయ్యేసరికి శాస్త్రి తిరిగి ఊళ్ళో అడుగుపెట్టేసరికి వీధి వీధినా తలలు బద్దలైన కుక్కలు, మారణ హోమమైపోయిన కుక్కలు కనిపించాయి. ఆ వూరివారి కసాయితనానికాసారి శాస్త్రి బాధపడ్డాడు. మర్నాడు సత్తిరాజు, అప్పలస్వామి, శాస్త్రి కలిసి ఆ కళేబరాల్ని ఖననం చేశారు.

ఊళ్ళో మనుషులు 'ఇన్నాళ్ళు మిమ్మల్ని తప్పర్థం చేసుకున్నాం' అన్న ధోరణిలో శాస్త్రితో మాట్టాడారు. సత్తిరాజు అల్లాగే మాట్టాడాడు. 'ఇవి వోరైనా పెంచుకున్న కుక్కలైతే సంపగలిగేవోరా?' ఊరకుక్కలు గనుకే సంపగలిగారు. ఇసువంటి, ఓరికి సెందని జాతి పుట్టకపోతేనే నయం' అని. శాస్త్రికి హఠాత్తుగా గుర్తు వచ్చింది. సత్తిరాజును కరిచిన కుక్కని ఊళ్ళోవాళ్ళు చంపేశారు. ఇప్పుడది పిచ్చి కుక్కవునో కాదో తెలుసుకునే అవకాశం లేదు. అందుకని 'పట్నం వెళ్ళి నువ్వు ఇంజక్షన్లు తీసుకో సత్తిరాజూ!' అన్నాడు శాస్త్రి.

'నువ్వెన్ని సెప్పు బాబూ! అది పిచ్చిది కాదు. దాన్ని సిన్నపిల్లప్పటి నుండి సూస్తున్నాను. అది ఓర్ని కరవటం నాను సూడనేదు. మొన్న ఏటో దానికి తిక్క రేగింది. కరిసింది. అది ఓ మడిసిని కరిచేసిందని మడుసులు దాన్ని సంపేశారు. అది పిచ్చిది అయితే మరి నానీపాటికి పిచ్చాణ్ణై పోనా! అవనేదంటే అది పిచ్చిది కాదన్నమాట' అన్నాడు నిర్ధారణగా సత్తిరాజు.

'అలా వెంటనే పిచ్చెక్కదు సత్తిరాజు. నీ వంట్లోకి, అది కరవటం వల్ల వెళ్ళిన పురుగులు నీకు పిచ్చెక్కించడానికి రెండు మూడు వారాలు పడుతుంది. పిచ్చెక్కకుండా మందుంది కాని, ఎక్కేక మందుల్లేవు' అన్నాడు శాస్త్రి.

'అసువంటి మాటలనవోకండి బాబు! మావోడు పయిల్మాను. వాడినే జబ్బు ఏటి సెయ్యనేదు' అంది సిఁవాచలం. శాస్త్రి మరి మాట్లాడలేక పోయాడు.

భయంతో కుక్కల్ని చంపిన ఊరువారికి భయం తీరాక. నిజంగా పిచ్చిదిలాగా లేదు. శాస్త్రగారి మాటలు మన్ని భయపెట్టాయి అంటూ అనుమానం, పాపభీతికలిగి తమ కసాయితనానికి శాస్త్రే కారణం అని నచ్చచెప్పుకున్నారు. పాపభారం మాటలతో శాస్త్రిమీదకి తోసేశాక నిశ్చింతగా 'అది పిచ్చిది కాద'న్న ప్రచారంలోకి దిగారు. శాస్త్రికి పాపభీతి లేదు. అందుకని శాస్త్రి పోయింది లేదు. కాని సత్తిరాజు 'నాన్సెప్పనేదా, అది పిచ్చిది కాదని' అంటూ ఇంజక్షన్లు పుచ్చుకోవటం మానేశాడు. పల్లెల్లో ఇంజెక్షన్లన్నా, ఆపరేషన్లన్నా భయపడతారు. చేతనైనంతవరుకు తప్పించుకుంటారు. అదే పని సత్తిరాజు చేశాడు.

వారంరోజులు ఏ విశేషం లేకుండా జరిగిపోయాయి. వారం తరువాత వో రోజు సిఁవాచలం ఏదో మాటల్లో 'మావోడీమద్దె మంచినీల్ల మాటెత్తితే గఁయిమంతున్నాడు' అని చెప్పింది లక్ష్మితో. అది శాస్త్రి విన్నాడు. సత్తిరాజు దగ్గరకు వెళ్ళి సోడా తాగుదాము రమ్మన్నాడు.

'వద్దు బాబు! నాకు దప్పిక నేదు. నా(న్రాను' అన్నాడు సత్తిరాజు. అతని మొహంలో భయం కొట్టొచ్చినట్టు కనిపించింది. శాస్త్రి తిరిగి వచ్చి సిం‌వాచలంతో 'సత్తిరాజుకి వెంటనే ఇంజెక్షన్లిప్పించాలి, లేకపోతే చచ్చిపోతాడు, ఇప్పటికే ఆలస్యం అయిపోయింది' అని చెప్పాడు.

సిం‌వాచలం రాగాలు మొదలుపెట్టింది. సత్తిరాజు దగ్గరకెళ్ళి 'నన్నన్యాయం సెయ్యకురా' అంటూ ఏడ్చింది. సత్తిరాజు సరేనన్నాడు. ఇద్దరు బయల్దేరుతుంటే ఊళ్ళో వాళ్ళు కబురు తెల్సివచ్చి 'పెద్దాసుపత్రికి వెళ్ళినవాళ్ళు, కాటికి వెళ్ళినవాళ్ళు తిరిగిరారు. చూడు సింహాచలం. ఇవాల అమావాస్య, మంచిది చూసుకుని రేపో ఎప్పుడో తీసుకువెళ్ళు. వాడు బతకాలని లేదా' అని సలహా ఇచ్చారు. శాస్త్రి ఆలస్యం చెయ్యొద్దని చెప్పాడు. అల్లా ఆలస్యంచేసి వెళ్ళటం వల్లనే పెద్దాసుపత్రికి వెళ్ళినవాళ్ళు కాటికి వెళ్ళిన వాళ్ళతో సమానం అవటం అంటూ చెప్పాడు. సత్తిరాజు ప్రాణం, తమది కాదు కనుక అమావాస్యనాడు బయల్దేరితే జరిగే ప్రమాదాలు గురించి సిం‌వాచలంకి బోధపరిచి ప్రయాణం అర్థరాత్రికి వాయిదా వేశారు.

అర్థరాత్రి శాస్త్రి వెళ్ళేసరికి సత్తిరాజు మంచంమీద కూర్చుని ఉన్నాడు. ఉన్నట్టుండి కుక్కలా మొరుగుతున్నాడు. చేతులు పైకిపెట్టి అరుస్తున్నాడు. ప్రపంచంతో సంబంధం లేనట్టు కూర్చున్నాడు. చూస్తున్నవాళ్లకి అతను బాధ భరించలేక అరుస్తున్నట్టుంది. కాని ఆ స్థితి దాటిపోయాడు. మహా అయితే మరారోజో ఎంతో. ఇంత అందమైన దేహం, ఇంత ఆరోగ్యమైన దేహం మూర్ఖత్వానికి బలైపోతోంది అని శాస్త్రి బాధపడ్డాడు. 'లాభంలేదు సింవాచలం' అన్నాడు శాస్త్రి. 'అల్లా అనవోకండి బాబు. సచ్చి మీకడుపునుడతాం' అంటూ ఏడ్చింది సిం‌వాచలం.

ఎద్దుబండి సత్తిరాజుతో కదిలింది. రెండురోజుల తరువాత అదేబండి సత్తిరాజు శవాన్ని తీసుకువచ్చింది. సిం‌వాచలం ఆశలు అడుగంటిపోయి, ఆమెకు పెళ్ళికాకుండానే వైధవ్యం కలిగింది. శాస్త్రికి సిం‌వాచలాన్ని, సత్తిరాజు శవాన్ని చూసే మనస్సులేక వెళ్లలేదు, లక్ష్మి వెళ్ళి సింవాచలాన్ని ఓదార్చి శవం బయల్దేరుతుంటే సిం‌వాచలాన్ని గట్టిగా పట్టుక్కూర్చుంది.

'వీళ్ళు వెళ్లటం తెల్లారకుండానే వెళ్ళారుట. పదిగంటలదాకా ఇంజెక్షనివ్వలేదుట. ఆ డాక్టర్లకి బీదవాళ్ళు ఆనరు. అస్పత్రులు డబ్బున్నవాళ్లకే' అన్నారు కొందరు.

'అయినా ఆ శాస్త్రి చచ్చిపోతాడో చచ్చిపోతాడో అంటూ ఒకటే అశుభం మాటలు' అన్నారు మరికొందరు.

ఆఖరికి తేలిందేమిటంటే నాలుగు గంటలాలస్యంచేసిన పెద్దాసుపత్రి డాక్టర్లు, అశుభం మాటలన్న శాస్త్రి, సత్తిరాజు మరణానికి కారకులు అని ●

(ఆంధ్ర సచిత్ర వార పత్రిక జూన్ 1973)